# సింగిల్ పేజీ కథలు

## కుడిఎడమైతే

**రాజారావుకి చాలా కోపంగా ఉంది. యాంత్రికంగా ఆఫీసుకి తెములుతున్నాడే గాని, మనసంతా కసితో నిండిపోయి ఉంది.**

**రాజారావు కోపానికి కారణం ఇరవై రోజులుగా తిరుగుతున్నా, కనరాని తహసీల్ ఆఫీసు గుమస్తా.**

రాజారావు గూర్చి తెలిసినవాళ్ళు అతనిని చాలా అదృష్టవంతుడని అంటారు. చదువు పూర్తవుతూనే బేంక్‌లో ఉద్యోగం దొరికింది. కష్టపడి పనిచేసే మనస్తత్వం కావడంతో, బేంక్‌లో కూడా మంచి పేరుంది. దాంతో పర్సనల్ లోన్స్ సాంక్షన్, రికవరీల సీటిచ్చారు. ఉద్యోగం దొరకటంతోటే పెళ్ళి. భార్య కూడా అనుకూలవతి కావడంతో సంసార జీవితం సాఫీగా సాగిపోతోంది. బేంక్‌లో లోను పెట్టి, ఒక ఇల్లు కూడా కొన్నాడు ఈమధ్యే.

అదిగో అప్పటి నుంచే రాజారావు కష్టాలు మొదలయ్యాయి.

కొన్న ఇల్లు తన పేర మార్చుకోడానికి, తహసీల్ ఆఫీసు చుట్టూ గత ఇరవై రోజులుగా తిరుగుతున్నాడు. కానీ, ఆ రిజిస్ట్రేషన్ గుమస్తా మాత్రం దొరికి చావడం లేదు. తను రోజూ ఠంచనుగా పదిగంటలయ్యేసరికి తహసీల్ ఆఫీసుకి వెళ్తూనే ఉన్నాడు. ఖాళీ కుర్చీయే రోజూ దర్శనమిస్తోంది.

శ్రీమతి అందించిన టిఫిన్ బాక్స్‌ని డిక్కీలోకి నెట్టేసి, స్కూటర్ స్టార్ట్ చేసాడు. తిన్నగా తహసీల్ ఆఫీసుకి వెళ్ళాడు. షరా మామూలే! ఖాళీ కుర్చీ.

పక్క సీటతని దగ్గరకు వెళ్ళి అడిగాడు- ''సార్! ఈ సీటులో అసలెవరైనా ఉన్నారా?'' అని.

తలైనా ఎత్తకుండానే అతను జవాబిచ్చాడు. ''వస్తారండి. గాభరా పడితే ఎలా? ఆ బెంచీ మీద వెయిట్ చేయండి''.




అసలే రోజా తిరిగి తిరిగి చికాకు పడుతున్నాడేమో- ఆ సమాధానానికి రాజారావుకి కోపం నషాళానికి అంటింది. రుక్మిణికి పారి జాతం కృష్ణుడిచ్చాడని విన్న సత్యభామకు మల్లే- 'నేయి వోయ భగ్గన దరికొన్న భీషణ హుతాశన కీల' వలె కోపం పీకలవరకు వచ్చింది. ''అదేంటండీ, అతను లేకపోతే అతని పని ఇంకెవరూ చూడరా?'' అన్నాడు.

రాజారావు మాటలకు అతను తలెత్తాడు. ''ఏం మాట్లాడుతున్నారు? అపాటి వెయిట్ చేయలేరా? నన్ను ఎక్కువ విసిగించక ఆ బెంచీ మీద కూర్చోండి.''

కోపాన్ని లోలోపలే దిగమింగుకున్నాడు రాజారావు. ఏం చేస్తాడు మరి? కార్యార్థియై వచ్చేడాయె. చివరకు సత్యభామలాగే 'మదహస్తి హస్త గత పద్మిని యుం వలె' డీలాపడి, నిట్టూర్చి, ఆ బెంచీ మీద కూలబడ్డాడు.

అరగంట గడిచింది. అయినా అయ్యగారి పత్తాలేదు.

నీరసంగా లేచి, స్కూటర్ స్టార్ట్ చేసి, బేంక్‌కి బయలుదేరాడు. అసలే లేటయ్యాడేమో, స్కూటర్‌ని వేగంగా పోనివ్వసాగాడు. అయితే, కష్టాలన్నీ ఒక్కసారే కట్టకట్టుకొని వస్తాయంటారు. వర్షం మొదలయ్యింది. చేసేదేం ఉంది? బండిని రోడ్డు పక్కగా ఆపి, అక్కడే ఉన్న బస్ షెల్టర్ క్రిందకి దూరాడు. చాలామంది, వర్షానికి బళ్ళను ఆపి, ఆ బస్ షెల్టర్‌లోకే చేరుతున్నారు.

తన మోటార్ సైకిలు ఆపి, బస్ షెల్టర్‌లోకి చేరిన, పక్కతనితో మాటలు కలిపాడు రాజారావు. ఎవరితోనైనా పంచుకుంటే తన కోపం తీరుతుందని ''ఈ ప్రభుత్వాఫీసులున్నాయి చూశారూ! ఎవడూ సమయానికి వచ్చి చావరు. టైముకి ఆఫీసుకి రాని వాళ్ళని డిస్మిస్ చేసి పారెయ్యాలి'' అన్నాడు.

అతను రాజారావు ఆవేశాన్ని అర్థం చేసుకోలేదు. తాపీగా ''ఏం చేస్తాం సార్! పనులు అవ్వాలంటే ఓర్పు కావాలి'' అన్నాడు.

''అదేంటండీ అలా అంటారు. టైము సెన్సు ఉండక్కర్లేదండీ? నేనే గనక ఛీఫ్ మినిస్టర్ అయ్యుంటేనా, ఆఫీసుకి టైముకి రాని వాళ్ళని సస్పెండ్ చేసేద్దును'' ఆవేశంగా

అన్నాడు రాజారావు.

దానికతను ''టైము సెన్సు అంటున్నారు. మరి మీరు కూడా ఇక్కడే ఉన్నారు. మీరే ఆఫీసులో పనిచేస్తున్నారో? అక్కడకు లేటవ్వ లేదా?'' అని అడిగాడు.

రాజారావు తనను సమర్ధించుకుంటూ- ''నేను లేటవ్వడమేమిటండీ. రోజూ టైముకే ఆఫీసుకి వెళ్తాను. నా సిన్సియారిటీ చూసే నాకు పర్సనల్ లోన్స్ సీటిచ్చారు. నేను బేంక్‌లో పనిచేస్తున్నాను. పర్సనల్ లోన్ సాంక్షన్, రికవరీ నా పని. అయితే గత ఇరవై రోజులుగా తహసిల్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ గుమస్తా కోసం తిరుగుతూ, బేంక్‌కి లేటవుతున్నాను'' అన్నాడు.

రాజారావు మాటలకి అతను పెద్దగా నవ్వాడు. ''ఓ అదా సంగతి! రేపు మీరు తహసిల్ ఆఫీసుకి వెళ్ళండి. పదిగంటలకి అతనక్కడ ఉంటారు. అతన్ని కలసి మీ పని పూర్తి చేసుకోండి. ఎల్లుండి బేంక్‌కి టైముకే వెళ్ళండి''

అతని మాటలకి రాజారావు ఆశ్చర్యపోయాడు. ''రేపతను పదికే వస్తాడని మీకెలా తెలుసు?'' అని అడిగాడు.

దానికతను నవ్వుతూ సమాధానం చెప్పాడు.

''సార్! నేనే ఆ తహసిల్ ఆఫీసు రిజిస్ట్రేషన్ గుమస్తాను. నా సాలరీ మీద పర్సనల్ లోను కోసం బేంక్ చుట్టూ మీకోసం తిరుగుతూ, గత ఇరవై రోజులుగా ఆఫీసుకి లేటవుతున్నాను. లేకపోతే, నేనెప్పుడూ టైముకే ఆఫీసులో ఉంటాను. రేపు మీకోసం బేంక్‌కి వెళ్ళడం మాని, ఆఫీసుకి వెళ్ళి మీ పని పూర్తిచేస్తాను. ఎల్లుండి మీరు టైముకి బేంక్‌కి వెళ్ళి, నా పని చూడండి.''

**-బి.హెచ్.వి.నాగేశ్వరరావు**

# చెప్పుదెబ్బ

పొరుగూరులో జరుగుతున్న పెళ్ళికి వెళ్ళారు రాజు, గోపి.

రాజుకు క్లాసులోను, బజార్లలోను, సినిమా హాలు దగ్గర అమ్మాయిలను ఏడిపించడం అలవాటు. స్నేహితులు ఎంత వారించినా వినేవాడు కాదు.

పెళ్ళిలో అమ్మాయిలను ఏడిపించకుండా వుండాలని మాట తీసుకొని బయలుదేరాడు గోపి, రాజుతో.

అయినప్పటికీ రాజు తనదైన శైలిలో అమ్మాయిలవైపు చూస్తున్నాడు. గోపి ఎంత వారించినా వినడం లేదు.

''ఒరేయ్! గోపి, ఆ బ్లూకలర్ చుడీదార్ వేసుకున్న అమ్మాయిని చూడరా, జన్మ తరించిపోతుంది'' హుషారుగా అన్నాడు రాజు.

గోపి మాత్రం టేప్ రికార్డర్‌లో వస్తున్న పాటలు వింటూ కుర్చీమీద కూర్చున్నాడు.

రాజు మాత్రం కామెంట్‌లు విసురుతున్నాడు.



మధ్యాహ్నం భోజనాల దగ్గర రాజు ఇటు అటు తిరుగుతూ ఆ అమ్మాయిని తాకుతూ వున్నాడు. ఆ అమ్మాయి సీరియస్‌గా చూస్తూ తప్పించుకుంటోంది. గోపి గమనిస్తూనే వున్నాడు.

సాయంత్రం షామియానా క్రింద కూర్చున్న వాళ్ళకు కారబ్బూందీ, టీ సప్లయ్ చేస్తున్నారు.

''రాజూ! నువ్వు పెళ్ళికొచ్చావా?'' అంటూ పలకరించింది రాజు పిన్ని కాంతం.

''అవును పిన్ని, ఉదయాన్నే వచ్చాను, మీరెప్పుడొచ్చారు'' అడిగాడు రాజు.

''నేను, చెల్లి ఉదయాన్నే వచ్చాం'' అంది కాంతం.

''చెల్లిని తీసుకొస్తాను ఇక్కడే వుండు. పద్మను నువ్వు చిన్నప్పుడు చూశావు'' అంటూ లోపలికెళ్ళింది కాంతం.

కాంతంతో వస్తున్న అమ్మాయిని చూసి రాజుకు ముచ్చెమటలు పోసాయి.

**-వైదా ఈశ్వరరావు (మింది)**




